


# దూరపు కొండలు

"రాధా, ఎల్లుండి, మెయిల్లో నేను వస్తున్నాను. ఇప్పటికే నిన్ను విడిచి పది రోజులు అయింది. ఈ రోజుతో నా క్యాంపు ఆఖరు. రేపే వద్దామని అనుకున్నాను. కానీ, చిన్న శేఖర్ ఉన్నాడు. వాడు ఇక్కడే పని చేస్తున్నాడట. మేమిద్దరం కలుసుకుని చాలా రోజులు అవటం వల్ల రేపంతా వాడితో గడిపితే కానీ వీలులేదని పట్టు పట్టాడు. అందుకు ఈ సారికి, నా చిన్ని రాధా, నన్ను క్షమిస్తావు కదూ?

"నీ లేఖలో నా వియోగం వల్ల కలిగే బాధ చూస్తే నాకు నవ్వు వచ్చింది. రాధా, నిజంగా నవ్వు వచ్చింది! నీకేనా ఆ బాధ? నాకూ ఉండదా? ఎప్పుడు అక్కడికి వచ్చి నీ కురులను పైకి తీస్తూ, చిలిపిగా చూసే నీ కనులను చూస్తూ వాటిలో నా ప్రతిమను చూస్తూ...

"ఆ ఎల్లుండి తప్పక వస్తాను. స్టేషనుకి వస్తావు కదూ? ఆకుపచ్చ చీర కట్టుకుని మరీ రావాలి సుమా! శశికి నా ముద్దులు. నీకు కూడా.

నీ మధు."

నిట్టూర్చింది రాధ ఉత్తరం చదివి.

రాధ తల్లిదండ్రులకు ఒక్కగా నొక్క గారాల కూతురు. కూతురు కోరిందే తడవుగా కూతురు బాధపడుతుందేమోనని అప్పుడే పెళ్లి చెయ్యటం ఇష్టం లేకపోయినా కూతురి ఇష్ట ప్రకారం రాధ సహాధ్యాయి విద్యార్థి మధుకి ఇచ్చి వివాహం చేశారు.

మధుకి కూర్చుని తినడానికి సరిపడ డబ్బు ఉన్నా తండ్రి సలహా మీద ఉద్యోగం పురుష లక్షణం అని ఉద్యోగంలో చేరాడు. ఊరికే కూర్చోవడం మధు అభిమతం కూడా కాదు. కాలేజీకి సెలవులు ఇచ్చినప్పుడే ఇంటి దగ్గిర కూర్చోవాలంటే విసుగు పొందే మనిషి ఇంక ఊరికే ఎలా కూర్చోగలడు?

ఇంతవరకు రాధ, మధుల అభిమతం ఒక్కటే కానీ మధు ఏ కంపెనీలో చేరినా బాగుండును, మెడికల్ కంపెనీలో కాకుండా. ఇక్కడే వచ్చింది ఇద్దరికీ అభిప్రాయభేదం.

"ఆ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా కాకుండా వేరే ఆఫీసులో పనిచేసే ఉద్యోగం చేసుకోకూడదా ఏమిటి? ఆ క్యాంపుల గొడవ నాకేం నచ్చలేదు" అంటుంది రాధ!

"అదికాదు, రాధా! నాకు అలా ఒకే కుర్చీలో ప్రొద్దుటినించి కూర్చోవటం ఇష్టం కాదు. అది మనతరం కాదు, బాబూ!" మధు సమాధానం.

"పోనీ, లెక్చరర్ ఉద్యోగం చెయ్యకూడదా ఏమిటి?"

"అమ్మో! అది అసలు వద్దు. దాంట్లో చేరితే ఆ పిల్లలకి సరిగ్గా పాఠం చెప్పకపోతే, 'మాస్టారు నాన పాములా పడుకున్నా రేమిటిరా' అని పేర్లు పెడతారు. ఇంక వాళ్ళ టైంటేబుల్‌లో నా క్లాసు వచ్చే సరికి 'నానపాము క్లాసు' అని రాసుకుంటారు" అని అనేవాడు.

"ఆ మరే, పాపం! అందరూ మీలాగే ఉంటారా ఏమిటి?"

"పోనీ, నాలా ఉండకపోతే ఎలా బుర్ర వంచుకుని బుద్ధిగా ఉంటారేం?"

"మీకు అసలు ఇష్టంలేక పోతే సరి, ఎన్ని అయినా చెబుతారు" అంటూ అక్కడి నించి వెళ్ళిపోయేది రాధ.

అంతగా ప్రేమించిన భర్తని, అందులో ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్తని పదిహేను రోజులు విడిచి ఉండాలంటే మరి ఎంత కష్టం?

క్యాంపులకి వెళ్ళేటప్పుడు రాధను కూడా తీసుకుని వెడదామనుకుంటాడు. కానీ, భార్యకి నీళ్ళ మార్పువల్ల ఏమి జబ్బు చేస్తుందో అని భయం ఒకటి. రెండు తన చిన్నారి కూతురు చదువు ఎక్కడ పాడవుతుందో అని ఇంకో భయం. ఈ రెండు కారణాల చేత వీళ్ళని ఇంట్లో ఉంచేస్తాడు.

"అమ్మగారూ, గిన్నెలు వడెయ్యండి!" అని అరిచిన సుబ్బులు కేకతో ఉలిక్కి పడి, గతాన్ని వెనక్కి నెట్టి వంట ఇంట్లోకి వెళ్ళింది రాధ. అంతలో శశి వచ్చి, "అమ్మా, ఆకలి వేస్తోందే" అంది. శశికి టిఫిన్, పాలు ఇచ్చి ఆటలకు పంపేసింది. మంచం దగ్గిరికి వచ్చి, 'అబ్బ! ఏమిటో ఈ జీవితం? అంతా బోర్!

తృప్తి ఉన్నవాడు దేవునితో సమానమైనవాడు అంటారు. కాని ఇంతకాలంగా మానవుడు సాధిస్తూ వచ్చిన ప్రగతిని పరిశీలిస్తే ఇంతకూ మూలకారణం, ఉన్న దానితో సంతృప్తి చెందడానికి అంగీకరించని తత్త్వమే అని స్పష్టం అవుతుంది. అలా అని అసంతృప్తి పూర్తిగా ఒక సుగుణమనికూడా చెప్పడానికి వీలులేదు.

ఏమీ తోచదు కదా!' అని విసుక్కుంది. 'పక్కనే ఉన్న షెల్ఫులో పెట్టిన పాత పుస్తకాలు అన్నీ మళ్ళీ చదవాలంటే విసుగు. ఛా ఏమీ తోచదు. ఈయన్ని ఆ వెధవ ఉద్యోగం మానండి! అంటే సరేమిరా అంటారు. ఆయన ఉంటే కనీసం ఎక్కడికైనా వెళ్ళే వాళ్ళం కదా?' అని విసుక్కుంది రాధ. కాస్సేపు మరునాటి రోజు తన భర్తతో గడిపే ఆనందసమయం ఆలోచించుకుని మురిసిపోయింది కానీ ఇంతలో బాధ. 'ఆ ఆనందం పట్టుమని పదిహేను రోజులు గడుస్తాయో లేదో మళ్ళీ కాంపు! ఛా!' అని కళ్ళు చిట్లించింది.

సుబ్బులు తెచ్చిన గిన్నెలు లోపల పెట్టి వంట మొదలు పెట్టింది రాధ.

"రాధా, ఎందుకు నీకీ బెడద? హాయిగా వంటవాణ్ణి పెట్టుకోక" అని వంటవాణ్ణి పెట్టిన మధుతో దెబ్బలాడి, "నాకు ఏమీ తోచదు. నేనే వంట చేస్తాను. ఆ మాత్రం వంటచేసి నా భర్తకి పిల్లలకి పెట్టగలను" అని వంటవాణ్ణి తీయించేసింది రాధ.

● ● ● ●

"రాధా! రాధా!"

ఎందుకో అని డ్రాయింగురూమ్‌లోకి వచ్చిన రాధని వీధిలోంచి పరుగు పరుగున వచ్చి గిరగిరా తిప్పేశాడు మధు.

"అబ్బ, ఏమిటండీ! కళ్ళు తిరుగుతూంటే!"

"ఆఁ అది సరేకానీ నీకు ఒక మంచి కబురు చెప్తాను. నాకు ఏమిస్తావు?" అన్నాడు మధు.

రాధ మధు టైని సరిచేస్తూ, "నేనే మీ దాన్ని అయినప్పుడు ఇంక మీకు ఇచ్చేది ఏముంది?" అంది గోముగా.

"మరే పాపం! ఎప్పుడూ ఈ మాట అని నాకు ఏమీ ఇవ్వవు" అని బుంగమూతి పెట్టి సోఫాలో కూర్చున్నాడు మధు. రాధ చిన్న నవ్వు నవ్వి, "అయ్యో! పాపం బుల్లి బాబు అలిగారు కానీ, అలక తీర్చాలా?" అని గేలి చేసింది.

"నన్ను ఏడిపించనక్కరలేదులే. నీకు అసలు ఆ కబురు చెప్పనే చెప్పను."

రాధ తగ్గుతూ, "అయితే ఏమి కావాలో చెప్పండి. ఇస్తాను" అంది.

"అయితే నాకు తియ్యటిది ఇస్తావా?"

"ఓ, అల్లాగే. శశి కోసమని తెచ్చిన చాకొలెట్లు ఉన్నాయిగా. అవి ఇస్తాలెండి."

"ఛా! అవి నాకు అక్కరలేదు."

"మరింకేమి కావాలి?"

"నీ తీయటి అధరామృతం."

"ఛా! సిగ్గు లేకపోతే సరి అంత గట్టిగా అనటానికి. ఎవరైనా వింటే ఏమనుకుంటారు?"

"ఏమనుకుంటారు? ఆహా, ఎంత అన్యోన్యంగా ఉన్నారు అని అనుకుంటారు."

"ఆఁ. ఆఁ. అదిసరేకాని ఆకబురు ఏమిటో చెప్పండి."

"మరేం... మరేం... ఏమీ లేదు."

"ఛా! ఎంత ఆశపెట్టారో, నాతో మీరు మాట్లాడక్కరలేదు" అంటూ వేరే చోట కూర్చుంది కోపంగా రాధ. టక్కున లేచి రాధ చేతులు పట్టుకుని, "ముక్కు మీద కోపం నీ ముఖానికే అందం" అంటూ, "అయ్యో, మరిచిపోయాను. ఈ పాట నాకు కోపం వస్తే నువ్వు పాడవలసినదికదూ. ఐ యామ్ వెరీ సారీ, తప్పు పాట పాడినందుకు. ఇంక అంత కోపంగా చూస్తే నే భరించలేను. కనక ఇంక చెప్పేస్తున్నాను. నాకు మన ఊరిలో లెక్చరర్ పోస్టు వచ్చింది. ఎల్లుండే చేరాలి. ఈ రోజే ఈ ఉద్యోగానికి బై బై చెప్పేస్తున్నాను."

"ఆఁ, నిజంగానా? ఇంతమంచి కబురు తెచ్చి ఇంత సేపు నన్ను ఏడిపించారేమిటండీ?" అంటూ తృప్తిగా పట్టలేని ఆనందంతో మధు వక్షఃస్థలంమీద వాలిపోయింది రాధ. ఇంక ఎప్పుడూ ఎడబాటు లేకుండా అలాగే ఉండవచ్చు కదా అని మురిసిపోయింది.

మధు ఉద్యోగంలో చేరాడు. రాధకి ఎందుకో అసంతృప్తి పెరిగిపోయింది. రాధ పాలవాడి కేకకు లేచి పాలు పోయించుకొని స్టౌ వెలిగించి కాఫీ డికాక్షన్‌వేసి, టిఫిన్ చేసి మధుకి టూత్‌పేస్టు, బ్రష్, నీళ్ళు ఇచ్చి, కూతుర్ని లేపి ముఖం కడిగించింది. అందరికి కాఫీ టిఫిన్లు ఇచ్చేసరికి ఎనిమిది గంటలు అయిపోయింది. మధుకి నీళ్ళు పోసుకోవడానికి నీళ్ళు తోడమని పనిమనిషితో చెప్పి, భర్త పోసుకున్నాక తను పోసుకుందామని వెళ్ళేసరికి శశి, "అమ్మా, నీళ్ళు పొయ్యవే, స్కూలుకి టైము అవుతూంది" అని వచ్చింది. శశికి నీళ్ళు పోసి, "అత్తయ్యచేత జడ వేయించుకో" అని చెప్పి గబగబా స్నానంచేసి వంట మొదలు పెట్టింది.

గాస్‌స్టౌతో వండే రాధకు ఆ కట్టె పొయ్యి మండక పొగ రావటంతో కళ్ళు ఇంతగా లావుఅయి నీళ్ళు కారసాగాయి. అంతలో శశి వచ్చి, "అమ్మా, అత్తయ్య జడ వెయ్యనందే. తను ఏదో రాసుకుంటూందిట. నీ అమ్మని వెయ్యమందే" అంటూ వచ్చింది. అసలే పొగతో సతమతమవుతున్న రాధకు కోపం పెరిగి, "నేను ఇప్పుడు వెయ్యను. కాసేపు ఆగు" అంది.

"నాకు స్కూలుకి టైము లేదు. లేటుగా వెడితే మాస్టారు తిడతారు" అని ఏడుపు లంకించుకుంది.

శశి ఏడుపు విని వీధిలో పేపరు చదువుకుంటున్న మధు వచ్చి, "శశిని ఎందుకు ఏడిపిస్తావు?" అంటూ విసుక్కున్నాడు.

దానికి రాధ సమాధానం చెప్పేలోపలే వీధిలోంచి, "మాస్టారూ" అని ఎవరో పిలవడంతోటే మధు వెళ్ళిపోయాడు.

రాధకి ఒళ్ళు మండిపోయింది. గబగబా వచ్చి శశికి జడ వేసేసరికి తొమ్మిది అయింది. "అన్నం పెట్టు" అని వచ్చాడు మధు.

రాధ ఏమి పెడుతుంది? ఎవరో అన్నట్టుగా ఉడికీ ఉడకని మెతుకులు అన్నది జ్ఞాపకం వచ్చింది రాధకు. "ఇంకో పది నిమిషాలు" అని చెప్పి ఎలాగో వండి అన్నం పెట్టేసరికి, "రాధా, పాపూజకి ఇంకా సామాను పెట్టలేదేమి?" అంది అత్తగారు.

అన్ని పనులు అయ్యేసరికి పదకొండు దాటింది. ఇంక అక్కడినుంచి ఖాళీ. ఏం చేస్తుంది? రాధ స్వెట్టర్లు ఎన్ని అని అల్లి ఎవరికి ఇస్తుంది?

పొద్దుట ఎలాగో గడుపుకోవచ్చు. మధ్యలో అయినా గడపవచ్చు కానీ సాయంత్రమైనా భర్తతో కులాసాగా షికారుకు వెడదామంటే ఉహూఁ అదీ లేదు. కనీసం రాత్రి అయినా భర్తతో కులాసాగా కాలం గడుపుదామంటే, ఆయనకు ఎక్కడ ఉన్నా తీరికే ఉండదు. సాయంత్రం కాలేజీనుంచి వచ్చేసరికి అయిదు అవుతుంది. కాఫీ తాగి ఏడు గంటల వరకు స్నేహితులతో గడిపి అక్కడినుంచి ఇంటికి వచ్చి స్నానంచేసి భోజనం చేసేసరికి ఎనిమిది అవుతుంది. ఇంతలో ఎవళ్ళో వచ్చి, "మాస్టారూ, ఈ ప్రాబ్లమ్ ఎలాగో తెలీటంలేదండీ" అంటూ అడుగుతారు. ఇంక వాళ్ళ అనుమానాలు అన్నీ తీర్చి లోపలికి వచ్చేసరికి ఏ పదో పదిన్నరో అవుతుంది. ఇంతలో తొమ్మిది గంటలకే పని అంతా ముగించుకుని వచ్చిన తనకి పొద్దుటినుంచి పని అలసటవల్ల శుభ్రంగా నిద్ర పట్టేస్తుంది. ఎంత మెలకువగా ఉందామన్నా లాభం శూన్యం.

ఇంక ఇది పనికాదని భర్తతో, "ఎందుకండీ, ఆ పిల్లల్ని ఊరికే రమ్మంటారు?" అంటే, "పోనీలే, పాపం. వాళ్ళ తెలివివాళ్ళు. వాళ్ళకి ప్రైవేట్లు చెప్పించుకునే తాహతు లేదు. మనకి ప్రైవేట్లు చెప్పి బతకవలసిన అవసరం లేదు. వాళ్ళకి ఊరికే చెబితే తప్పు ఏముంది?" అంటారు.

తను "డబ్బుకోసం అలా అనటంలేదండీ" అంటే, "ఇంక ఎందుకేమిటి?" అంటారు. ఇంక ఎలా చచ్చేది?

హాయిగా ఇదివరకటి ఉద్యోగంలో ఉంటేనే బాగుంది. ఎరక్కపోయి ఈ జీవితం బాగుంటుందని పోరుపెట్టింది. ఇప్పుడు మళ్ళీ మార్చుకోమంటే తిడతారు. అయినా అత్తగారూ వాళ్ళు ఏమనుకుంటారో కదా? ఛా! అప్పుడు పదిహేను రోజులు వియోగం అనుభవించినా వియోగంలోనే ఆనందం ఉంది. ఇంక ముందు భర్త వస్తాడు. హాయిగా ఆనందంగా కాలం గడపవచ్చునని ఆ పదిహేను రోజులు ఆనందంలో తేలిపోవచ్చు. అలా వియోగ సంయోగాలవల్ల ఎప్పటికీ ఆనందం అనేది కొత్తగానే ఉండేది. ఉన్న దాంట్లోనే సంతృప్తిపడక ఏవో అందుకోవాలని దూరంగా నున్నగా కనపడుతున్న ఆ కొండలు ఎక్కి సరదాగా కిందికి జారదామనుకుంది. 'ఏమిటో, బాధగా నిట్టూర్పులతో గడిపెయ్యవలసి వస్తూంది కదా' అనుకుంది రాధ ఒకనాటి సాయంత్రం.

● ● ●

"అమ్మగారూ, పాలు" అన్న కేకకి ఉలిక్కిపడి లేచింది రాధ. గబగబా పాలు పోయించుకుని వంట గదిలోకి వచ్చేసరికి రాధకి నిద్రమత్తు వదిలి ఏదో కొత్తగా అనిపించింది. ఆ కొత్త ఏమిటో తెలుసుకున్నాక సంతోషాన్ని పట్టలేకపోయింది రాధ.

సి. లక్ష్మి

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

రక్తంలోని దోషాలే
చర్మవ్యాధులకు మూలం



చర్మవ్యాధులనుంచి విముక్తికి మీకు సమగ్రమైన చికిత్స అవసరము.

● గ్రంధులను పరిరక్షిస్తూ క్రిములను సంహరించాలి
● లోపల రక్తాన్ని శుభ్రపరిచి, గ్రంధులను పునరుజ్జీవింపజేయాలి

ఈ లక్ష్యంతోనే డాక్టర్ రిచ్‌లెస్ తయారుచేసిన మూడు ప్రక్రియలు ఇప్పుడు ప్రపంచ ఖ్యాతి నొందినవి.

రిచ్‌లెస్ బ్లడ్ ప్యూరిఫైయర్ : అనేక చర్మవ్యాధులు ఎగ్జిమా, చెమటకాయలు, మొటిమలు, తామర, గోలి మున్నగు వాటికి వ్యాధిని తొలగించే మందు. మీ రక్తాన్ని శుభ్రపరిచి, ఆరోగ్యప్రదం చేస్తుంది.

గర్లాస్ అయిట్‌మెంట్ : ఎగ్జిమా నీళ్లు కారుతూ వున్నపుడు, గాయాలు, పుండ్లు మొదలైన వాటికి శక్తిమంతమైన యాంటి సెప్టిక్.

రిచ్‌లెస్ లాక్సాటివ్ : మలబద్ధకం నివారించి, ఆహారం అరుగుదలను పెంచి, తద్వారా రక్తాన్ని శుభ్రపరుస్తుంది.




# రిచ్‌లెస్
బ్లడ్ ప్యూరిఫైయర్

కెమిస్టులందరివద్ద, స్టోరులలోను లభ్యం కాగలదు. వివరాలు తెలిపే ఉచిత కరపత్రాన్ని అడిగి తీసికోండి. ఏజెంట్లు లేనిచోట్ల ఏజెంట్లు కావాలి :
ఈ కింద విలాసానికి వ్రాయండి :
ఇండియాలో సోల్ డిస్ట్రిబ్యూటర్లు
మహేశ్వరి జనరల్ స్టోర్స్
19/35, పెద్ద బజారు, కోయంబత్తూరు-1
EP-MG 2 TEL

# దూరపు కొండలు

'ఏమిటి, నేను అనుభవించిందంతా కలా? నిజమేనా?' నమ్మలేనట్టుగా ఒళ్లు గట్టిగా గిల్లుకుంది. ఆ నెప్పికి గట్టిగా అరిచింది రాధ. నెప్పిపెడుతున్నా రాధకి చాలా ఆనందంగా ఉంది.

'అబ్బ, ఎంత విచిత్రంగా వచ్చింది కల! నిజంగా నేను చాలా అదృష్టవంతురాల్ని. నాకు ఈ అనుభవం అనుభవంలోకి రాకుండా కలగా మిగిలింది. నాకు ఈ అనుభవం చాలు. ఉన్నదాంట్లోనే సంతృప్తి ఉంది. సంతృప్తి కోసం, సుఖ సంతోషాలకోసం ఊళ్లన్నీ గాలించ నక్కరలేదు. ఉన్నదాంట్లోనే సంతృప్తి వెతుక్కుని నీ హృదయాన్ని నింపెయ్యి. నీకు చాలా బాగుంటుంది' అనుకుంది రాధ.

'నా భర్త ఈ ఊళ్లో లేకపోయినప్పుడు ఖాళీ. నాకు తోచదు అని నేను ఎందుకు అనుకోవాలి? ప్రైవేటుగా ఎమ్.ఎ.కి వెడతాను. తీరిగ్గా ఉన్నప్పుడు స్వెట్టర్లు అల్లుతాను. అవి లేనివాళ్లకు ఇస్తాను. ఎదురింటి గుమాస్తాగారి పిల్లలకి చదువు చెబుతాను. ఇంత మందికి ఇంత చేస్తున్నానే అనే సంతోషంతో నా హృదయం నిండిపోతుంది. ఇటు భర్తతో పదిహేనురోజులు విడిపోతామే అన్న దిగులు ఉన్నా పదిహేను రోజులు అమితానందాన్ని పొందుతాను' అని అనుకుని సంతృప్తిగా నిట్టూర్చింది రాధ.

ఇంతలో శశి లేచి, "అమ్మా! డాడీ వస్తారన్నావు. స్టేషన్‌కి నేనూ రావద్దా?" అంది.

"ఓ! తప్పకుండా రా అమ్మా."

● ● ●

రైల్లోనించి తొంగిచూస్తున్న మధుకి తన భార్య ఇదివరకటికన్నా అందంగా ఆనందంగా కనబడింది. ట్రెయిన్ ఆగగానే గబగబా భర్త దగ్గరికి వచ్చింది రాధ. "డాడీ, నాకు ఏమి తెచ్చావు?" అంటూ తండ్రి చెయ్యి పట్టుకుంది శశి. "నీకు బోల్డు బొమ్మలు తెచ్చానమ్మా" అని శశి బుగ్గ గిల్లి రాధకేసి చూసి తమాషాగా నవ్వాడు.

రాధ ఆ నవ్వుచూసి మురిసిపోయింది. 'తనకి ఇంకకన్నా ఏమి కావాలి? ఈ విరహం తరవాత కలిసిన ఆనందం అప్పుడు వస్తుందా? రాదు' అనుకుంది రాధ.

సామాను కార్లో డ్రైవరు పెట్టాక కారుఎక్కారు. మధు దోవలో రాధమీద చెయ్యివేస్తూ, "రాధా, అక్కడ శేఖర్ కనపడ్డాడని చెప్పలేదు? అదే వ్రాయలేదు—వాడు చెప్పాడు మన ఊళ్లో లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉందని, నాన్నగారు ప్రయత్నిస్తే నాకు దొరుకుతుందని" అని అన్నాడు.

రాధ గుండె గతుక్కు మంది.

"నాకు వద్దు అని చెప్పేశాను. నీకు కోపం రాలేదు కదా" అన్నాడు.

"అమ్మయ్య" అనినిట్టూర్చి, "మంచిపనిచేశారు!" అంది రాధ.

రాధకి కోపం వస్తుందనుకున్న మధుని రాధ సమాధానం ఆశ్చర్యచకితుణ్ణి చేసింది.

"డాడీ, ఇల్లు వచ్చేసింది. ఇంక దిగండి" అన్న శశి కేకకి ఈ లోకంలో పడ్డాడు మధు. ★